
నమస్తే తెలంగాణ

**కామారెడ్డి**

5 | నిజామాబాద్, మంగళవారం 24 జూన్ 2025 | KAMAREDDY


# కేసీఆర్‌ను విమర్శించే అర్హత,స్థాయి అర్వింద్‌కు లేదు..

- రెండుసార్లు ఎంపీగా గెలిచినా.. జిల్లాకు చేసింది శూన్యం
- అహంభావంతో విర్రవీగుతూ మర్యాద లేని కుసంస్కారి
- ప్రజలు పాతాళానికి తొక్కే రోజు దగ్గరలోనే ఉంది
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, జూన్ 23 : ఐదు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉండి, చావు నోట్లో తల పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే అర్హత, స్థాయి బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఎంత మాత్రం లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ అర్వింద్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తండ్రి వయస్సు ఉన్న కేసీఆర్‌తోపాటు తెలంగాణ ఉద్యమకారులైన కేటీఆర్, హరీశ్‌రావు, కవితపై వ్యక్తిగతంగా దూషిస్తూ, దిగజారి మాట్లాడిన మాటలు ఆయన స్థాయిని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. సింహం లాంటి కేసీఆర్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న అర్వింద్ అహంకారానికి ప్రజలు తొందరలోనే పాతరేస్తారని హెచ్చరించారు. 71 ఏండ్లు ఉన్న కేసీఆర్ ముసలివాడైతే 74 ఏండ్లు ఉన్న మోదీని ఏమనాలని ప్రశ్నించారు. అర్వింద్ తండ్రి డీఎస్ రాజకీయంగా సమాధి అనుకున్న సమయంలో మళ్లీ ఎంపీని చేసి వెలుగులోకి తెచ్చింది కేసీఆర్ అని గుర్తుచేశారు.అర్వింద్ ముఖం చూసి ఎవ రూ ఓట్లు వేయరని, 'నన్ను చూసి కాదు మోదీని చూసి బీజేపీకి ఓట్లు వేయండి' అని అడుక్కొని యాక్సిడెంటల్ ఎంపీ అయ్యావని ఎద్దేవా చేశారు. రెండుసార్లు ఎంపీగా గెలిచినప్పటికీ, జిల్లాకు, నియోజకవర్గ ప్రజలకు అందించిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. ఎప్పుడు ఇతరులపై మతి లేని, బూతు మాటలు మాట్లాడుతూ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్వింద్‌కు అడ్డగోలుగా మాట్లాడడం తప్ప ఒక్క అంశంపై కూడా సరైన అవగాహన లేదని తెలిపారు. 'బనకచర్ల'ను 'జనకచర్ల'గా అనడం, ఇరిగేషన్ పై అవగాహన లేకుండా ఈ మధ్య అర్వింద్ మాట్లాడిన మాటలు ఆయన విషయ అవగాహన స్థాయిని ప్రజలకు అర్థమయ్యేలా చేశాయని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన వైఫల్యాలపై మాట్లాడకుండా ఇంకా బీఆర్ఎస్ పార్టీపై నిత్యం విమర్శలు చేయడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటే అని ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు.

## వ్యక్తిగత లబ్ధి కోసమే బీఆర్ఎస్‌పై విమర్శలు

రేవంత్ రెడ్డి ద్వారా వ్యక్తిగత లబ్ధి పొందడానికే బీజేపీ ఎంపీలు ఇంకా బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల హక్కులు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం నిత్యం పోరాడుతుంటే, బీజేపీ ఎంపీలు మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణకు చేస్తున్న అన్యాయంపై ఒక్క మాట కూడా మాట్లాడలేని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అనేక అంశాల్లో వారి పార్టీల్లోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, ముందు వారి పార్టీని చక్కదిద్దుకోవాలని, తర్వాత ఇంకొకరి మీద ఏడవాలని సూచించారు. అధికార మదంతో అహంభావంతో విర్రవీగుతున్నావని, కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలే న్యాయ నిర్ణేతలని, సమయం వచ్చినప్పుడు వారే అర్వింద్ అహంభావాన్ని రాజకీయంగా పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు.

# కేసీఆర్ తెలంగాణ సూర్యుడు

- ఆయనతో పెట్టుకుంటే మాడి మసికాక తప్పదు
- ఎంపీ అర్వింద్ దురహంకారి, కుసంస్కారి
- కేసీఆర్, కేటీఆర్, కవితపై అవాకులు, చెవాకులా?
- బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి



ఖలీల్‌వాడి, జూన్ 23: జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ ఒక దురహంకారి, కుసంస్కారి అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితపై అర్వింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవితపై అవాకులు చెవాకులా అని అర్వింద్‌పై జీవన్ రెడ్డి నిప్పులు చెరిగారు. అవినీతి బురద గుంట ఫ్యామిలీలో పుట్టిన అర్వింద్‌కు నీతి, నియమంలేదని ఘాటుగా విమర్శించారు. కేసీఆర్ ఫ్యామిలీని తిట్టి పెద్ద నాయకుడివై పోవాలనుకుంటున్నావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చినందుకు కేసీఆర్ ను జైల్లో పెడతారా? అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, కవిత కాలిగోటికి కూడా అర్వింద్ సరి పోడని పేర్కొన్నారు. బీజేపీనే రప్పా,రప్పా అని తెలంగాణ నుంచి తరిమి కొడతారని హెచ్చరించారు. అర్వింద్ గుజరాత్ గులామ్ లా మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా తెలంగాణ సోయి తెచ్చుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ తెలంగాణ సూర్యుడని, ఆయనతో పెట్టుకుంటే అర్వింద్ మాడిమసికాక తప్పదని జీవన్ రెడ్డి హెచ్చరించారు.

# 'పోలీసు ప్రజావాణి'కి శ్రీకారం

- ప్రారంభించిన సీపీ సాయి చైతన్య
- మొదటి రోజు ఐదు ఫిర్యాదులు
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



బాధితుల సమస్యలను వింటున్న సీపీ సాయిచైతన్య

వినాయక్‌నగర్, జూన్ 23: నిజామాబాద్ సీపీ సాయి చైతన్య సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్లకు ఎవరైనా తమ సమస్యలను నేరుగా వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చు. ఇందుకోసం ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వెంటనే పరిష్కారమయ్యేలా సంబంధిత పోలీస్ సిబ్బందిని ఆదేశించనున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించగా..తొలి రోజు ఐదు ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను పరిశీలించిన సీపీ.. వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం, ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించు కోవాలని సీపీ ఈ సందర్భంగా సూచించారు.

- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో ప్రైవేట్ పాఠశాలల నిర్లక్ష్యం
- ముందుకురాని యాజమాన్యాలు
- తూతూ మంత్రంగా అధికారుల తనిఖీలు
- కామారెడ్డి జిల్లాలో 210 స్కూల్ బస్సులకు మాత్రమే సామర్థ్య పరీక్షలు పూర్తి
- ఇప్పటి వరకు నాలుగు బస్సులు సీజ్

**నూతన** విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు వివిధ రకాల వాహనాలను ఆశ్రయిస్తుంటారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మాత్రం తమ సొంత బస్సుల్లోనే విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తుంటాయి. అయితే ఈ బస్సులను ఫిట్‌గా ఉంచడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు చోటుచేసుకొని విద్యార్థులు గాయాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో బస్సుల ఫిట్‌నెస్‌పై పాఠశాల యాజమాన్యాలు, డ్రైవర్లకు ఆర్టీవో అధికారులు అవగాహన కల్పించారు. బస్సులను తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నా కొందరు పట్టించుకోవడంలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు నిర్వహిస్తూ ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తున్నారు.

–కామారెడ్డి, జూన్ 23

# అనుభవం లేని డ్రైవర్లు

# ఫిట్‌లెస్ బస్సులు!



## ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలు

- పాఠశాల బస్సు నడిపే డ్రైవర్‌కు ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- 60 ఏండ్లు నిండిన డ్రైవర్లు బస్సు నడపరాదు.
- 15 ఏండ్లు నిండిన బస్సులో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లరాదు.
- డ్రైవర్లకు మెడికల్ పరీక్షలు పాఠశాల యాజమాన్యం ప్రతి మూడు నెలలకోసారి చేయించాలి.
- బస్సుకు కనీసం ఒక అటెండర్‌ను నియమించాలి.
- పాఠశాలలోని ప్రతి బస్సుకూ ఒక కమిటీని ఏర్పాటు చేసి, కమిటీలో డ్రైవర్, ఒక టీచర్,ఒక విద్యార్థి తల్లిదండ్రులు ఉండాలి.
- పాఠశాల బస్సు 40 కి.మీ వేగం కన్నా ఎక్కువగా వెళ్లరాదు.
- ప్రతి సంవత్సరం ఆర్టీఏ అధికారులతో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలి.
- బస్సు తలుపులకు లాక్ సిస్టం ఏర్పాటు చేయడంతోపాటు బస్సు కిటికీలకు గ్రిల్స్ అమర్చాలి.
- బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఎమర్జెన్సీ బాక్సు, ఫైర్ ఎస్టింగ్విషర్ బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసుకోవాలి.
- బస్సులకు పసుపు రంగు వేయడంతోపాటు బస్సు ముందు, వెనక భాగంలో స్కూల్ బస్సు ఆన్ స్కూల్ డ్యూటీ రాయించాలి. విద్యార్థుల బ్యాగులు ఉంచేందుకు ప్రత్యేక స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

## గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు

కామారెడ్డి జిల్లాలో పలు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సులకు ఫిట్‌నెస్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. పాత వాహనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, వాటిని విద్యార్థులను తరలించడానికి ఉపయోగిస్తున్నారు. అంతేగాక ఆ బస్సులను నడపడానికి తక్కువ వేతనంతో అనుభవంలేని డ్రైవర్లను నియమించుకుంటున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కామారెడ్డి పట్టణంలో షార్ట్ సర్క్యూట్‌తో బస్సులో పొగలు రావడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపివేశాడు. అందులో నుంచి చిన్నారులను దింపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఎల్లారెడ్డిలో ఓ స్కూల్ బస్సు ద్విచక్ర వాహనదారుడిని ఢీకొనడంతో అతను మృతిచెందాడు. ఇలాంటి ఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో తమ విద్యార్థులను పాఠశాల బస్సుల్లో పంపించాలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బోధన్ మండలం పెంటకుర్దూలో ఘటన

కామారెడ్డి జిల్లాలో దాదాపు అన్ని ప్రైవేట్ పాఠశాలలు తమ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాయి. విద్యార్థులను తరలించడానికి పాఠశాలల యాజమాన్యాలు ఏడాది ఫీజు వసూలు చేస్తున్నాయి. అయితే ఈ బస్సులు విద్యార్థులను ఎంత వరకు సురక్షితంగా పాఠశాలలకు చేరుస్తాయనేది బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ అనుభవంతో ముడిపడి ఉంటుంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనా కొన్ని ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. దీంతో ఆర్టీవో అధికారులు వాటిని సీజ్ చేశారు. పాఠశాలలకు దూరంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల బస్సు లేదా ఆటోలో పంపిస్తుంటారు. పాఠశాలల యాజమాన్యాలకు అడ్మిషన్లు, ఫీజులపై ఉన్న శ్రద్ధ విద్యార్థులు ప్రయాణించే బస్సులపై లేకపోవడం గమనార్హం. జిల్లాలో కొన్ని పాఠశాలల యాజమాన్యాలు తక్కువ ధరకు వాహనాలను కొనుగోలు చేసి రంగులు వేయిస్తున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండానే రోడ్లపైకి పంపిస్తున్నారు. ఈ బస్సులను అనుభవం లేని వారు నడుపుతున్నారు. రెన్యువల్, ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో పాఠశాల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల అధికారులు కూడా నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో మొత్తం 250 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 210 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు ప్రైవేట్ పాఠశాల బస్సులను సీజ్ చేశారు. పిల్లలను తమ పాఠశాలల్లో చేర్పించాలంటూ ప్రచారం కోసం లక్షల రూపాయలు ఖర్చుచేస్తున్న యాజమాన్యాలు.. పాఠశాల బస్సులను ఫిట్‌నెస్‌గా ఉంచడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తుండడం గమనార్హం.



### ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే కఠిన చర్యలు..

కామారెడ్డి జిల్లాలో 250 బస్సులకు ఇప్పటి వరకు 210 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నారు. మిగతా 40 బస్సులకు చేయించుకోవాలి. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగు బస్సులను సీజ్ చేశాం. ఫిట్‌నెస్ లేని బస్సులను నడపడానికి వీలు లేదు. ఒకవేళ నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిట్‌నెస్‌లేని వాహనాలను సీజ్ చేస్తాం.

-శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి జిల్లా రవాణాశాఖాధికారి

# డబ్బుల కోసం.. తల్లిని హతమార్చిన తనయుడు



గైక్వాడ్ చంద్రకళ (ఫైల్)

బోధన్ రూరల్, జూన్ 23: డబ్బుల కోసం కన్న తల్లినే కడతేర్చాడు ఓ కసాయి కొడుకు. ఈ ఘటన బోధన్ మండలం పెంటకుర్దూ గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గైక్వాడ్ చంద్రకళ(59)కు కొన్నేండ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో పెండ్లి చేశారు. ఆమెకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉండగా వారందరికీ పెండ్లిలు అయ్యాయి. మహారాష్ట్రలో నివాసం ఉంటున్న చంద్రకళ కొన్ని సంవత్సరాల క్రితం పెంటకుర్దూ గ్రామానికి వచ్చి ఉంటున్నది. అప్పుడప్పుడు చిన్న కొడుకు సురేశ్ తల్లివద్దకు వచ్చిపోతుండేవాడు. ఆదివారం రాత్రి డబ్బుల కోసం తల్లిపై గొడ్డలితో దాడి చేసి హత మార్చాడు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కొడుకే నరికి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

# ఎస్సై, ఏఎస్సై సంతకాలు ఫోర్జరీ

- పెద్దకొడప్‌గల్ కానిస్టేబుల్ నిర్వాకం
- సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ

కామారెడ్డి, జూన్ 23: ఎస్సై, ఏఎస్సై సంతకాలను ఫోర్జరీ చేసిన కానిస్టేబుల్ రవి కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్ద కొడప్‌గల్ పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో కానిస్టేబుల్ రవి కుమార్ బస్సు వారెంట్ల కోసం ఏఎస్సై సంతకాలను ఫోర్జరీ చేశాడని, విధులకు గైర్హాజరైనప్పుడు పైఅధికారులకు ఎస్సై సంతకాలు ఫోర్జరీ చేసి తప్పుడు నివేదికలు పంపించాడని ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఆరోపణలపై బాన్సువాడ డీఎస్పీ విచారణ చేపట్టి సమర్పించిన నివేదికను పరిశీలించి సదరు కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేసినట్లు పేర్కొన్నారు. రవికుమార్ ప్రస్తుతం దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడని తెలిపారు. బాధ్యతారాహిత్యంగా పనిచేస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. పోలీసు ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# నిర్మాణ పనుల్లో డొల్లా..

ప్రారంభోత్సవానికి ముందే కూలిన ప్రహరీ

- బస్సు రివర్స్ తీస్తుండగా ఘటన
- తప్పిన పెను ప్రమాదం
- నేడు ఎల్లారెడ్డి బస్టాండ్‌ను ప్రారంభించనున్న మంత్రి

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 23: ఎల్లారెడ్డి పట్టణంలో నూతనంగా ఆర్టీసీ బస్టాండ్ నిర్మించగా.. ప్రారంభోత్సవానికి ముందే నాణ్యత లోపాలు బయటపడ్డాయి. సుమారు రూ. 4 కోట్ల నిధులతో బస్టాండ్‌ను నిర్మించారు. ఈ నెల 24న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావ్ బస్టాండ్‌ను ప్రారంభించాల్సి ఉండగా.. బస్టాండ్ ప్రహరీ కూలిపోవడంతో పనుల్లో డొల్లతనం బహిర్గతమైంది. సోమవారం బస్టాండ్‌లోకి వచ్చిన మెదక్ డిపోకు చెందిన బస్సు రివర్స్ తీసుకునే క్రమంలో వెనుక బస్టాండ్, బీసీ కాలనీకి మధ్యలో నిర్మించిన ప్రహరీ, రెయిలింగ్ కూలిపోయింది. అక్కడే ఉన్న పలువురు కేకలు వేయడంతో డ్రైవర్ వెంటనే బస్సును నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఏమాత్రం అలసత్వం వహించినా, ఒక్క ఫీటు బస్సు వెనక్కి వెళ్లినా ప్రహరీకి దగ్గరగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టేది. బస్టాండ్ ఆవరణ చిన్నగా ఉండడం, దానికి తోడు బస్టాండుకు ఆనుకొని బీసీ కాలనీకి చెందిన నివాస గృహాలు ఉండడంతో ప్రమాదాలు జరిగితే పెద్ద ఎత్తున నష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయి. ఎల్లారెడ్డి బస్టాండ్ నిర్మాణంపై పేదోడి ఎయిర్ పోర్ట్ అంటూ నాయకులు గొప్పగా ప్రచారం చేయడం గమనార్హం.



బస్సు వెనుకభాగం తాకడంతో కూలిన ప్రహరీ

# కలెక్టరేట్ ఎదుట విద్యార్థుల ధర్నా

బెస్ట్ అవైలెబుల్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కంఠేశ్వర్, జూన్ 23 : బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటివరకు పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన సామాజిక వర్గం విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్కీం కింద రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ. 300 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని, దీంతో పాఠశాలల యాజమాన్యాలు ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులను చదువుకోవడానికి అనుమతించడం లేదన్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఫీజులు చెల్లించి పాఠశాలకు పంపాలని యాజమాన్యాలు చెబుతున్నాయని వాపోయారు. గత్యంతరం లేక కలెక్టర్‌కు తమ గోడు విన్నవించుకోవడానికి వచ్చామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

# ఐజీ ఆఫీస్‌కు కామారెడ్డి సీఐ అటాచ్

- ఆయన స్థానంలో నరహరి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ

కామారెడ్డి, జూన్ 23 : కామారెడ్డి పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డిని ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆయన స్థానంలో నరహరిని నియమిస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు తమకు కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.